- కార్పొరేట్ స్థాయిని మించి వైద్య సేవలు
- మన్యానికి వరంగా మెడికల్, నర్సింగ్ కాలేజీలు
- తల్లీబిడ్డల కోసం వంద బెడ్లతో పెద్దాసుపత్రి
- తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా ఉచిత పరీక్షలు
- పలు ఆసుపత్రులు అప్‌గ్రేడ్.. బెడ్ల సంఖ్య పెంపు..
- వాటిల్లోనూ ఆపరేషన్లు..

నూతన వైద్యుల నియామకం..



కొత్తగూడెం మాతాశిశు కేంద్రం

# సామాన్యుల చెంతకు.. సర్కారు వైద్యం

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) :సర్కారు వైద్యం సామాన్యుల చెంతకు చేరింది. వలస పాలనలో ఉన్న మాదిరిగా నేడు ప్రభుత్వ వైద్యశాలలు లేవు. కార్పొరేట్‌కు దీటైన సౌకర్యాలు, ప్రైవేటుకు మించిన నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మెడికల్, నర్సింగ్ కళాశాలలు మన్యం విద్యార్థులకు వరంగా మారాయి. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం కొత్తగూడెం వంద బెడ్లతో పెద్దాసుపత్రి మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి రూ.వేల రూపాయల వెచ్చించే బాధలు తప్పిపోయాయి. జిల్లా కేంద్రంలోనే తెలంగాణ డయాగ్నస్టిక్స్ ఏర్పాటైంది. దాదాపు 134 పరీక్షలు ఉచితంగా అందతున్నాయి. ఇవన్నీ తెలంగాణ సిద్ధించాక బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమయ్యాయి. అంతకుముందు అత్యంత అధమంగా ఉన్న వైద్యం రంగం సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేట్టాక అద్భుతంగా రూపుదిద్దుకుంది. గడిచిన పదేళ్లలో భద్రాద్రి జిల్లాలో వైద్య రంగం సాధించిన ప్రగతిపై ప్రత్యేక కథనం.

### పల్లె ప్రాంతాలకూ సర్కారు వైద్యం..

పట్టణాల్లోనే అందుబాటులో ఉండే వైద్య సేవలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లె ప్రాంతాలకూ విస్తరించింది. నాడు ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా కేవలం ఏఎన్‌ఎంలు సేవలందించే వారు. నేడు అవే ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానలుగా అప్‌గ్రేడ్ చేసి వైద్యులను నియమించింది. వాటిల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వైద్య సేవలు అందుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 240 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ వాటిలో 153 సబ్ సంటర్లకు పల్లె దవాఖానలుగా అప్‌గ్రేడ్ చేశారు.

### జిల్లాలో ఆసుపత్రుల ముఖచిత్రం..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 29
పట్టణ ఆరోగ్య కేంద్రాలు: 5
కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు: 5
ఏరియా ఆసుపత్రి: 1 భద్రాచలం
జిల్లా ఆసుపత్రి: 1 కొత్తగూడెం
మాతాశిశు ఆరోగ్య కేంద్రం: 1 రామవరం.
పల్లె దవాఖానలు: 153
సబ్ సెంటర్లు: 87

### వైద్య రంగం మరింత బలోపేతం..

నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు స్థానికంగానే ప్రజలకు అందుతున్నాయి. ప్రభుత్వ వైద్య రంగాన్ని సీఎం కేసీఆర్ మరింత బలోపేతం చేశారు. పల్లె దవాఖానలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలను అధునాతన సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చారు. గతంలో తాత్కాలిక సేవలందించిన బూర్గంపహాడ్, మణుగూరు, అశ్వారావుపేట, ఇల్లెందు, పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రాలు నేడు ఆపరేషన్లు చేసే స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. వాటిల్లో బెడ్ల సంఖ్యను పెంచారు. దీంతోపాటు జిల్లా కేంద్రంలోని రామవరం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లాలోని తల్లీబిడ్డలకు పూర్తిస్థాయి ఆరోగ్య రక్షణను ఇస్తోంది. జిల్లాకే వన్నె తెచ్చే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మూడు రాష్ట్రాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చుకుంటోంది. అలాగే మణుగూరు ఆసుప్రతి బెడ్ల సంఖ్యకు 100కు పెరిగింది. ఇల్లెందు, అశ్వారావుపేటల్లో కూడా 30గా ఉన్న బెడ్లను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 100కు పెంచింది. పాల్వంచలో 50, బూర్గంపహాడ్ 30 ఉన్నాయి. కొత్తగా చర్లలో 30 బెడ్లను ఏర్పాటు చేసి దానికి సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేశారు. అలాగే, జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో సేవలందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇటీవల 50 మంది వైద్యులను నియమించింది. వారంతా ఇక్కడ బాధ్యతలు తీసుకొని సేవలందిస్తున్నారు. వీరిలో ప్రసూతి వైద్యులే 8 మంది ఉన్నారు.


మణుగూరు ఆసుపత్రిలో మాతా శిశువులతో వైద్యాధికారులు

### స్థానికంగానే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు..

ప్రమాదకరమైన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను కూడా జిల్లాల్లోనే చేసే విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్యం కోసం పటిష్ట చర్యలు చేపట్టింది. మహిళల్లో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లను గుర్తించేందుకు రూ.40 లక్షల విలువైన మమోగ్రాం, కాల్‌ఫో స్కోప్ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లను గుర్తించేందుకు ప్రైవేటులో అయితే ఒక్కో పరీక్షకు కనీసం రూ.3 వేల వరకూ ఖర్చవుతుంది. ప్రభుత్వం ఈ పరికరాలను సర్కారు వైద్యశాలల్లో ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఈ భారం తగ్గినట్లవుతుంది.

### మన్యానికి వరంగా మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలు..

జిల్లాలో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసి మెడికల్, నర్సింగ్ కళాశాలలు మన్యానికి వరంగా మారాయి. 150 సీట్లతో మెడికల్ కాలేజీ, 60 సీట్లతో నర్సింగ్ కాలేజీ అందుబాటులోకి వచ్చాయి. మొన్నటి వరకూ 57 పరీక్షలు నిర్వహించిన తెలంగాణ డయాగ్నస్టిక్స్ ఇప్పుడు 134 పరీక్షలు చేస్తోంది.

### పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు పెరిగాయి..



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో జిల్లాలో వైద్య సేవలు మరింత మెరుగయ్యాయి. అన్ని పీహెచ్‌సీల్లోనూ తఓపీ పెరిగాయి. ప్రసూతి సేవల కోసం మహిళలు అధికంగా వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

**–డాక్టర్ శిరీషా, డీఎంహెచ్‌వో**

### నూతన వైద్యులను నియమించాం..



వైద్య విధాన పరిషత్‌లో సేవలు మెరుగయ్యాయి. కొత్తగా ఏర్పాటు చేసిన పల్లె దవాఖానల్లోనూ, అప్‌గ్రేడ్ చేసిన ఆసుపత్రుల్లోనూ నూతన వైద్యులను నియమించాం. ఇల్లెందు, అశ్వారావుపేట, మణుగూరు, బూర్గంపహాడ్ వైద్యశాలల్లో సర్జరీలు కూడా చేస్తున్నాం. జిల్లాకు మంజూరైన డయాలసిస్ కేంద్రాల ద్వారా జిల్లా రోగులకు ఇక్కడే సేవలందిస్తున్నాం.

**–డాక్టర్ రవిబాబు, డీసీహెచ్‌ఎస్ .**

### రేడియాలజీ హబ్‌తో ఎంతో ఉపయోగం..



రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయేలా తెలంగాణ డయాగ్నస్టిక్స్ రేడియాలజీ హబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంతో ఖరీదైన వైద్య పరీక్షలన్నీ దీని ద్వారా పేదలకు ఉచితంగా అందుతున్నాయి. జిల్లా ఆసుపత్రిలో ఓపీ అధిక సంఖ్యలో ఉంటోంది. రూ.2 కోట్లతో త్వరలో ప్రత్యేక ఇంటెన్సివ్ కేర్ యూనిట్ కూడా అందుబాటులోకి వస్తుంది.

**–డాక్టర్ కుమారస్వామి, ఆసుపత్రి సూపరింటెండెంట్**

---

## ఉమ్మడి జిల్లాలో..
# మూడోరోజు 24 నామినేషన్లు

ఖమ్మం, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది శాసనసభ నియోజకవర్గాలకు నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. బరిలో నిలిచే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లా నుంచి 24 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనున్నది. ఖమ్మం నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గుంటి నాగరాజు, బాణాల లక్ష్మణాచారి నామినేషన్లు దాఖలు చేశారు. పాలేరు నియోజకవర్గం నుంచి ఇస్లావత్ రాజేందర్, హలావత్ శోభన్‌బాబు, అజ్మీరా కిషన్, అల్లిక వెంకటరమణి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వైరా నియోజకవర్గం నుంచి గుగులోతు బావ్‌సింగ్, మాలోతు శ్యాంలాల్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. మధిర నియోజకవర్గం నుంచి ఆధార్ పార్టీ నుంచి అంబోజు బుడ్డయ్య నామినేషన్ వేశారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా చిప్పలపల్లి వీరయ్య నామినేషన్ దాఖలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి యువతరం పార్టీ తరపున ప్రవీణ్‌కుమార్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి చీమల వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నుంచి మోకాళ్ల కృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పాయం వెంకటేశ్వర్లు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పాల్వంచ దుర్గ, వాసం మంగయ్య, భద్రాచలం నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరపున తెల్లం వెంకట్రావు, తెల్లం సీతమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి పాండ్రు హేమసుందర్ స్వతంత్ర అభ్యర్థిగా రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మెచ్చా నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా కల్లూరి కిశోర్, అంగోతు కృష్ణ, కుంజా నాగమణి, కంగాల కల్లయ్య నామినేషన్లు దాఖలు చేశారు. కాగా.. ఈ నెల 10వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నది. నామినేషన్ల స్వీకరణకు ఇంకా నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండడంతో పోటీ చేసే ఆశావహులు మంచి ముహూర్తం కోసం వేచి చూస్తున్నారు.


భద్రాచలం ఆర్‌డీవో మంగీలాల్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు

# బీఆర్‌ఎస్ ప్రచారానికి బ్రహ్మరథం

**రెండు నెలలుగా కొనసాగుతున్న 'వనమా' ప్రచారం**

**గల్లీగల్లీకీ ప్రచార రథాలు..**

**కళాకారుల నృత్యాలు..**

**ఆలోచింపజేస్తున్న తెలంగాణ పాటలు, పథకాలు..**



పాటలు పాడుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న తెలంగాణ కళాకారులు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 6: కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పార్టీ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు కూడా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు రెండు నెలలుగా ప్రజాక్షేత్రంలోనే ఉంటున్నారు. మరోమారు తనను గెలిపించాలని కోరుతూ అభ్యర్థిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ప్రచారపర్వంలో ఆయనే ముందున్నారు. జాతీయ పార్టీల నుంచి అభ్యర్థులెవరో ఇంకా తేలలేదు. అసలు అభ్యర్థి ఎవరో తేల్చుకోవడానికే పార్టీలకు సమయం సరిపోవడం లేదు. ఇదే సమయంలో వనమా దూసుకెళ్తుండడతో ప్రత్యర్థుల్లో టెన్షన్ మొదలైంది.

### గల్లీగల్లీకి ప్రచార రథాలు..

బీఆర్‌ఎస్ అంటే సీఎం కేసీఆర్ పథకాలు, తెలంగాణ పాటలే గుర్తుకొస్తాయి. ఇందుకు అనుగుణంగానే బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి పాటల రూపంలో కళాకారుల చేత ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రత్యేకంగా కళాకారులతో ఏర్పాటు చేసిన వాహనాల్లో డప్పు, వాయిద్య కళాబృందాల సభ్యులు పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ పథకాల గురించి విస్తృత ప్రచారం చేస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, చుంచుపల్లి, సుజాత నగర్, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని మారుమూల గ్రామాల్లోనూ సుమారు 10కి పైగా వాహనాలు ప్రచారం చేస్తున్నాయి. రెండు ప్రత్యేక వాహనాల్లో కళాకారులు వివిధ సెంటర్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

### మ్యానిఫెస్టోపై విస్తృత ప్రచారం..

ప్రస్తుత పథకాల కొనసాగింపుగా ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోపై కళాబృందాలు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. దీంతో మ్యానిఫెస్టోలోని అంశాలపై గ్రామాల్లోని ప్రజలు చర్చించుకుంటున్నారు. అందుకే వనమా ఏ గ్రామానికి వెళ్లినా అక్కడ ఆయనపై ప్రజలు పూలు చల్లుతూ ఘనత స్వాగతం పలుకుతున్నారు. వనమా ప్రచారం గ్రామాల్లో ఒక దశ పూర్తయింది.

### ఇంకా తేలని జాతీయ పార్టీల అభ్యర్థులు..

ఒకవైపు బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచారంలో ముందుకువెళ్తుంటే మరోవైపు కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం లాంటి పార్టీల అభ్యర్థులెవరో ఇంకా తేలలేదు. దీంతో ఆయాపార్టీల కార్యకర్తల్లో నైరశ్యం నెలకొంది. నామినేషన్ల ఘట్టం మొదలైన నాలుగు రోజులు దాటినా అభ్యర్థుల లెక్కలే తేలలేదు. ఇక ప్రచారం సంగతి సరేసరి. ఇదే సమయంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పేరు మాత్రం నియోజకవర్గంలో మార్మోగిపోతోంది.